మహావీరుడు వడ్డే ఓబన్న

● కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ● ఘనంగా జయంతి వేడుకలు



వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్, అసిస్టెంట్ కలెక్టర్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్, వడ్డెర సంఘం నాయకులు

అనంతపురం టౌన్/క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్‌వారితో పోరాడి ప్రాణాలు అర్పించిన మహా వీరుడు వడ్డె ఓబన్న అని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వడ్డె ఓబన్న జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. కలెక్టర్, జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, ఆర్టీసీ రాయలసీమ రీజియల్ చైర్మన్ పూల నాగరాజు, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ఒక్కో ప్రాంతంలో ఒక్కో వీరుడు పోరాటాలు చేశారని, ఆ వీరులలో వడ్డె ఓబన్న ఒకరని అన్నారు. అలాంటి మహనీయుడి జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని అన్నారు. ఓబన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకలలో జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ సుభాషిణి, డ్వామా పీడీ సలీమ్ బాషా, పశుసంవర్థక శాఖ డీడీ వెంకటస్వామి, డీపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంచెపు వెంకటేష్, టీడీపీ నాయకులు వడ్డె సిమెంట్ పోలన్న, వడ్డె సరళ, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, పీఎల్ఎన్ మూర్తి, నాయకులు చల్లా రామాంజినేయులు, లక్ష్మన్న, సుధాకర్, చంద్ర, వెంకటరాముడు, నాగేంద్ర, వెంకటాద్రి, రవి, హనుమంతు, రామకృష్ణ, ఉదయ్ శంకర్ పాల్గొన్నారు.



ఓబన్న జయంతి వేడుకలలో పాల్గొన్న అధికారులు, వడ్డెర సంఘాల నాయకులు, ప్రజలు

తెలుగుజాతికి గర్వకారణం: ఏఆర్ ఏఎస్పీ



నివాళులు అర్పిస్తున్న ఏఎస్పీ ఇలియాజ్‌బాషా

బ్రిటీష్ వారితో వీరోచితంగా పోరాడి అమరుడైన వడ్డె ఓబన్న తెలుగు జాతి గర్వించదగ్గ వీరుడని ఏఆర్ ఏఎస్పీ ఇలియాజ్‌బాషా అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి బ్రిటీష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు ఓబన్న అని కొనియాడారు. వడ్డె ఓబన్న జీవితం ఆదర్శప్రాయమని అన్నారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఏఆర్ ఏఎస్పీ, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐలు దేవానంద్, వెంకటేష్, ఆర్ఎస్ఐ జాఫర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మడిని సిద్ధం చేస్తూ..

వరినాట్లు వేస్తున్న కూలీలు



నిండిన అరవకూరు చెరువు

పచ్చని పండుగ

నిండిన అరవకూరు చెరువు

మూడేళ్ల తరువాత ఆయకట్టుకు జీవం

హంద్రీ నీవా, పీఏబీఆర్ నీటితో కూడేరు మండలం అరవకూరు గ్రామ చెరువు నిండింది. చెరువు ఆయకట్టు కింద మూడేళ్లుగా బీడుగా ఉన్న భూములు జీవం పోసుకుని.. వరి నాట్లతో కళకళలాడుతున్నాయి. ఈ చెరువు కింద అరవకూరు, కమ్మూరు గ్రామ రైతులకు దాదాపు 540 ఎకరాల భూమి ఉంది. ఇదంతా సాగులోకి వచ్చింది. చెరువు నీటితో వందలాది బోరుబావుల్లో నీటి మట్టం పెరిగింది. దీంతో ఆ భూముల్లోనూ సాగు పనులు ఊపందుకున్నాయి. రైతులు వరి సాగు పనుల్లో తీరికలేకుండా గడుపుతున్నారు. ఒకేసారి పనులు మొదలు కావడంతో కూలీలు లభించడం లేదు. మరోవైపు పశుసంపద తగ్గిపోవడంతో పనులకు యంత్రాలను వాడుతున్నారు. పెట్టుబడి ఖర్చులు ఎకరానికి రూ.25 వేల వరకూ వస్తున్నాయని రైతులు అంటున్నారు. అరవకూరు చెరువు మరువ శనివారం పారింది. ఈ నీరు దిగువనున్న పొట్టి చెరువు, నరసనాయనికుంట చెరువు, కొడిమి, కోటంక సమీపంలోని కుంటలకు చేరుతుంది. దీంతో ఆ ప్రాంతాలకు మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, కూడేరు

వందశాతం ఆయకట్టు సాగు



అరవకూరు చెరువు కింద ఆయకట్టు వందశాతం సాగులోకి వచ్చింది. చెరువులో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసి ఆయకట్టుకు అందిస్తాం. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసులు కృషితో హంద్రీ-నీవా, పీఏబీఆర్ నీరు చెరువుకు చేరుతోంది. మూడేళ్ల తరువాత ఆయకట్టును సాగు చేస్తున్నాం.

- ఈశ్వరయ్య, ఆయకట్టు రైతుల సంఘం చైర్మెన్, అరవకూరు

పెట్టుబడులు పెరిగాయి..



ఒకటిన్నర ఎకరంలో వరి సాగు చేయడానికి రూ.35 వేల వరకు పెట్టుబడి వచ్చింది. చెరువులో నీరు సమృద్ధిగా ఉంది. అందుకే వరి సాగు చేస్తున్నాం. అప్పులు చేసి పెట్టుబడి పెడుతున్నాం. ఎకరానికి 40 బస్తాల దిగుబడి వస్తే గిట్టుబాటు అవుతుంది.

- నారాయణ, అరవకూరు

బియ్యం ధరలు పెరిగాయని..



మార్కెట్‌లో బియ్యం ధరలు పెరిగాయి. బియ్యం కొనలేని పరిస్థితి నెలకొంది. అందుకే ఉన్న ఒకటిన్న ఎకరంలో అప్పు చేసి వరి పంట సాగు చేస్తున్నాం. మంచి దిగుబడి సాధించాలని కష్టపడుతున్నాం. అందు కు తగిన మద్దతు ధర కల్పిస్తే అప్పుల నుంచి బయట పడతాం.

- యల్లప్ప, అరవకూరు



హిల్ వ్యూ స్టేడియంలో చీకట్లను చీల్చే వెలుగుల ప్రదర్శన


అదిరేలా.. ఆటలు

సాయి విద్యార్థుల స్పోర్ట్స్ మీట్

సత్యసాయి శత జయంతి వేడుకలు ప్రారంభం

పుట్టపర్తి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని హిల్ వ్యూ స్టేడియంలో సత్యసాయి విద్యార్థుల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ అబ్బురపరిచింది. హిల్ వ్యూ స్టేడియంలో ప్రశాంతి నిలయం, అనంతపురం, బెంగళూరు బృందావనం, నందిగిరి విద్యార్థులు సత్యసాయి చిత్రపటానికి వందన సమర్పణ చేశారు. అనంతరం యూనివర్సిటీ జెం డాను ఆవిష్కరించి, క్రీడాజ్యోతిని వెలిగించారు. సత్యసాయి స్పోర్ట్స్ మీట్‌తో బాబా శత జయంతి వేడుకలు ప్రారంభమైనట్లు ట్రస్టు ప్రతినిధులు ప్రకటించారు. విద్యార్థులు మొదట సంగీత, నృత్య ప్రదర్శనతో అలరించారు. ఆ తరువాత రోప్ విన్యాసాలు, కారు, బైక్ జంపింగ్‌తో అబ్బురపరిచారు. స్పోర్ట్స్ మీట్‌ను తిలకించడానికి వేలాది మంది తరలివచ్చారు. స్పోర్ట్స్ మీట్‌లో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, శ్రీసత్యసాయి గ్లోబల్ ట్రస్టు చైర్మన్ చక్రవర్తి, ట్రస్టు సభ్యులు నాగానందం, సత్యసాయి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రాఘవేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





సత్యసాయి శత జయంతి వేడుకల ప్రారంభ సూచనగా..

ఎలా ఇచ్చేశారో..!

అధికారుల ప్రమేయం లేకుండా అప్పులు

70 సంఘాలకు రూ.ఆరు కోట్లకు పైగా..?

ఫోర్జరీ సంతకంతో బయట పడిన బాగోతం


డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేసిన సీసీ



తన సంతకాలు లేకుండా రుణాల్ని ఇప్పించారు అంటూ పీడీకి సీసీ రాసిన లేఖ



విడపనకల్లు వెలుగు కార్యాలయం



చార్మినార్ సంఘం తీర్మానంలో సీసీ సంతకం లేని దృశ్యం

విడపనకల్లు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఓ యానిమేటర్ బ్యాంకు అధికారుల నుంచి 70 మహిళా సంఘాలకు రూ.6 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేయించారు. మంజూరైన సొమ్మును సభ్యులలో కొందరికే ఇచ్చారు. మరికొందరికి సంతకాలను ఫోర్జరీ చేసి డ్రా చేశారు. విడపనకల్లు గోదావరి గ్రామైక్య సంఘంలోని చార్మినార్ మహిళా సంఘంలో వారం క్రితం ఫోర్జరీ సంతకం చేసి రూ.2 లక్షలు డ్రా చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. తనకు తెలియకుండా చార్మినార్ గ్రామ సంఘంలోని మహిళలకు రూ.2 లక్షలు చొప్పున రుణం మంజూరు చేశారని విడపనకల్లు సీసీ నాగమణి డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేశారు. చార్మినార్ మహిళా సంఘం బాధ్యత తనదని, మమత అనే యానిమేటర్ తనకు తెలియకుండానే ఈ సంఘానికి రుణాన్ని మంజూరు చేయించారని ఈరన్న అనే యానిమేటర్ కూడా పీడీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నిబంధనలు తూచ్

విడపనకల్లులో 108 మహిళా సంఘాలు ఉన్నాయి. గోదావరి గ్రామైక్య సంఘం పరిధిలో 56, ఇందిరా గ్రామైక్య సంఘం పరిధిలో 52 సంఘాలు ఉన్నాయి. గోదావరి సంఘాలకు యానిమేటర్ ఈరన్న. ఇందిరా సంఘాలకు యనిమేటర్ మమత. కానీ ఈరన్న 16 సంఘాలు, మమత 92 సంఘాల బాధ్యతలను చూస్తున్నారు. యానిమేటర్‌గా ఉన్న వ్యక్తి బుక్ కీపర్‌గా చేయటానికి లేదు. కానీ మమత రెండు పనులూ చేస్తున్నారని ఈరన్న ఫిర్యాదులో పేర్కొన్నారు. వెలుగు కార్యాలయంలో ఏ సంఘానికి రుణాన్ని మంజూరు చేయాలన్నా తొలుత సీసీ రికార్డులను తయారు చేయాలి. అనంతరం రికార్డులను పరిశీలించి, అన్ని సక్రమంగా ఉంటే ఏపీఎం సంతకం చేస్తారు. తరువాత యానిమేటర్ ద్వారా బ్యాంకుకు సిఫారసు చేస్తేనే ఆ మహిళా సంఘానికి రుణాన్ని మంజూరు చేస్తారు. కానీ ఇక్కడ బ్యాంకు అధికారులు, యానిమేటర్ కలిసి నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేశారని వెలుగు అధికారులు ఆరోపిస్తున్నారు. మినిట్స్‌లోను, తీర్మానాల్లోను సీసీ సంతకాలు, ఏపీఎం సంతకాలు లేకున్నా రుణాలు ఇచ్చారని అంటున్నారు.

నిబంధనల ప్రకారమే..

మహిళా సంఘాలకు రుణాల మంజూరు చేసిన ఫైల్స్‌పై సీసీలు సంతకాలు ఉన్నాయి. మా బ్యాంకులో రూల్స్ ప్రకారమే రుణాలు మంజూరు చేస్తాం. మా బ్యాంక్‌లో ఎలాంటి అవినీతికి చోటు లేదు. వెలుగు అధికారుల సంతకాలు లేకుండా ఏమైనా రుణాలు మంజూరు చేశారేమో బ్యాంకు రికార్డులను పరిశీలించి తెలుసుకుంటాం.

- లక్ష్మీపతి నాయక్, కెనరా బ్యాంక్ మేనేజర్, విడపనకల్లు

మా ప్రమేయం లేకుండా..



వెలుగు అధికారులకు సమాచారం ఇవ్వకుండా యానిమేటర్లు బ్యాంకు అధికారులతో మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయిస్తున్నారు. మమత అనే యానిమేటర్ ఇలాగే చేశారు. సంఘాల్లో సభ్యులు లేకున్నా లక్షల్లో రుణాలు మంజూరు చేయించారు. 60 నుంచి 70 సంఘాలకు రుణాలు మంజూరు చేసినట్టు తెలిసింది. కొన్ని సంఘాలకు రూ.5 లక్షలు, మరి కొన్ని సంఘాలకు రూ.10 లక్షలు, సీనియర్ సంఘాలకు రూ.20 లక్షల ప్రకారం రుణాలు మంజూరు చేశారు. లత అనే మహిళ సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ.2లక్షలు డ్రా చేశారని తేలింది. లోతుగా విచారించి చర్యలు తీసుకుంటాము.

- కాలానాయక్, ఏపీఎం విడపనకల్లు

మా సంతకాలు లేవు..

మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేసే సమయంలో యానిమేటర్లు తెచ్చిన రికార్డులపై మాత్రమే సీసీ, ఏపీఎం సంతకాలు చేస్తారు. చార్మినార్ మహిళా సంఘానికి సంబంధించి మా సంతకాలు లేవు. ఇలా ఇంకా ఎన్ని చేశారో పరిశీలించాల్సి ఉంది. 70 సంఘాలకు రుణాలు మంజూరు చేశారని తెలిసింది. కానీ ఎన్నింటికి మా సంతకాలు ఉన్నాయో తెలియదు.

- నాగమణి, సీసీ, విడపనకల్లు

కుష్ఠు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్



కుష్ఠు సర్వే అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తదితరులు

అనంతపురం టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి బాధితులను గుర్తించడం కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని వైద్య శాఖాధికారులకు కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో కుష్ఠు సర్వేపై శనివారం సమీక్షించారు. కలెక్టరు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు కుష్ఠు రోగులను గుర్తించడం కోసం ప్రభుత్వం సర్వే చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రతిఇంటికి వెళ్లి కుష్ఠుపై అవగాహన కల్పిస్తూనే, ఎవరికైనా ఆ వ్యాధి లక్షణాలు ఉన్నాయేమో పరిశీలించాలన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు కలిగిన మచ్చలు ఉంటే వారిని ఆస్పత్రికి పంపించి వైద్యపరీక్షలు చేయించాలన్నారు. ఒకవేళ కుష్ఠు అని తేలితే బాధితులకు అవసరమైన వైద్యసేవలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కుష్ఠును తొలిదశలోనే గుర్తిస్తే ఆరు నెలలు పాటు మందులువాడితే నయమవుతుందన్నారు. ఇదే విషయాన్ని బాధితులకు తెలియజెప్పి వైద్యం తీసుకునేలా చూడాలన్నారు. పాఠశాలలు, హాస్టళ్లలో కూడా పిల్లలకు క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, టీబీజిల్లా అధికారి డాక్టరు అనుపమ జేమ్స్, డీఐఓ డాక్టరు యుగంధర్, డాక్టరు గంగాధరరెడ్డి, డెమోలు త్యాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం పోరాటం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాల తీరును నిరసిస్తూ, హక్కుల సాధనకోసం పోరాటం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని మెడికల్ రెప్రజెంటేటివ్స్ హాల్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగినా కార్మికుల వేతనాలు పెంచాలన్న ధ్యాస కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని, ఈ మొండి ప్రభుత్వాలను పోరాటాలద్వారానే ఎదుర్కోవాలని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అంగన్వాడీలు 42 రోజులు, మున్సిపల్ కార్మికులు 16 రోజులు పోరాడి సాధించుకున్న జీఓలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన కారణంగానే గత ప్రభుత్వం కార్మికుల ఆగ్రహానికి గురైందని గుర్తు చేశారు. ప్రస్తుతమున్న కూటమి ప్రభుత్వం కూడా కార్మికుల గురించి పట్టించుకోవట్లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గోపాల్, ఉపాధ్యక్షుడు మస్నీల రామాంజినేయులు, కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ, మల్లికార్జున, అచ్యుత్, ఏటీఎం నాగరాజు, ఎన్టీఆర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టరులో రోడ్డుపై గుమ్మడి కాయలను అమ్ముతున్న సాంబశివారెడ్డి

సంక్రాంతి గుమ్మడి

సంక్రాంతి వచ్చిందంటే ఇళ్ల ముందు ముగ్గులు వేస్తారు. వాటిని గొబ్బెమ్మలు, గోగుపూలు, గుమ్మడి కాయలతో అలంకరిస్తారు. ఈ పండుగకు పక్వానికి వచ్చేలా గుమ్మడి కాయలను పండిస్తే లాభసాటిగా ఉంటుందని గుర్తించిన ఓ రైతు.. 20 ఏళ్ల నుంచి లబ్ధి పొందుతున్నాడు. గుంతకల్లు మండలం నల్లదాసరిపల్లికి చెందిన సాంబశివారెడ్డి తన తోటలో మిర్చిని సాగుచేస్తూ మేరసాళ్లలో గుమ్మడి పాదులు వేసి సరిగ్గా సంక్రాంతికి ఫలసాయం చేతికి వచ్చేలా చూసుకుంటున్నాడు. మార్కెట్టుకు తీసుకెళ్తే దళారులు గుమ్మడి కాయ ఒకటిని రూ. 10లకు అడుగుతుండటంతో తానే ట్రాక్టరులో తెచ్చి మార్కెట్టు బయట ఉంచి పండుగ నాలుగురోజులు అమ్ముతూ వస్తున్నాడు. కాయ సైజును బట్టి రూ. 40, రూ. 50 చొప్పున అమ్ముతున్నట్టు పేర్కొన్నాడు. ట్రాక్టరులో రోజుకు 500 కాయలు తెచ్చి మూడురోజుల్లో 1500 కాయలను అమ్మానని, సీజన్ మొత్తంపై ప్రతి ఏడూ 2,500 కాయలు అమ్ముతూ వస్తున్నట్టు రైతు సాంబ శివారెడ్డి తెలిపాడు. గుమ్మడి కాయల విషయంగా పోటీ లేకపోవడంతో గడచిన 20 ఏళ్లుగా ప్రతి పండుగకూ రూ.లక్షదాకా ఆదాయాన్ని పొందుతున్నట్లు తెలిపాడు.

- ఆంధ్రజ్యోతి, గుంతకల్లు

ఇప్పుడైనా...

• వైసీపీ పాలనలో ఆగిపోయిన ఆస్పత్రుల నిర్మాణాలు



నిలిచిపోయిన రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణ పనులు



ఆగిపోయిన యాడికి హాస్పిటల్ నిర్మాణ పనులు

సుమారు రూ.3.80కోట్ల వ్యయంతో చేపట్టిన యాడికి, రాయలచెరువు ఆస్పత్రుల నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో యాడికిలో శిథిలావస్థకు చేరిన భవనాల్లోనే రోగులు చికిత్స పొందాల్సి వస్తోంది. ఎప్పుడు ఏమి కూలుతుం దోనని ఆరోగ్య సిబ్బంది భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాయలచెరువులో రేకులషెడ్డులోనే రోగులకు చికిత్స అందిస్తున్నారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తామని హామీలు గుప్పించారు. అయితే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో చేస్తున్న పనులను అర్ధంతరంగా ఆపేశారు. కూటమి ప్రభుత్వమైనా సక్రమంగా నిధులు మంజూరు చేసి ఆస్పత్రుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, యాడికి

ఇంకా గుంతలే!

• సంక్రాంతి వస్తున్నా మరమ్మతుకు నోచుకోని రోడ్లు

సంక్రాంతి పండుగ వస్తున్నా మండలంలోని కొన్ని గ్రామీణ రోడ్లు ఇంకా గుంతలమయంగానే కనిపిస్తున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి పనులను పట్టించుకోకపోవడంతో మండలంలోని గ్రామీణ రోడ్లు ఛిద్రమయ్యాయి. గుంతల రోడ్లపై ప్రయాణించిన పలువురు ప్రమాదలకు గురయ్యారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమైనా నాటి పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించింది. సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. కానీ మండలంలో రోడ్లు నేటికీ గుంతలతో దర్శనం ఇస్తున్నాయి. మండల కేంద్రంలోని కొండక్యాంప్ కాలనీలో గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. హరేసముద్రం గ్రామ పరిధిలో ఫ్యాక్టరీ ఉండటంతో వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మండల కేంద్రంతో పాటు కురువల్లి రోడ్డులో ఉన్న గుంతలు పూడ్చకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కళ్లదేవనహళ్లి రోడ్డును నిర్మించేందుకు ఉన్న రోడ్డును తవ్వి వదిలేడంతో ద్విచక్రవాహనదారులు కింద పడి గాయపడుతున్నారు. శ్రీధరఘట్ట, దేవగిరి, సిద్దరాంపురం తదితర గ్రామాల రోడ్లు గుంతలతో దర్శనం ఇస్తున్నాయి. గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం నిర్దేశించిన మేర లక్ష్యాలను చేరుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, బొమ్మనహాళ్



బొమ్మనహాళ్‌లోని బళ్లారి - కళ్యాణ దుర్గం రహదారిపై పడిన గుంతలు..



తవ్వి వదిలేసిన కళ్లు దేవనహళ్లి రోడ్డు

పతకానికో లెక్క



ఆడినోళ్లకు..ఆడినంత

- గెలిస్తే భారీగా నజరానాలు
- స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ 3శాతానికి పెంపు
- నూతన పాలసీతో క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు నజరానాలు, ప్రోత్సాహకాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రకటించింది. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పన, శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం ప్రతి గ్రామంలోనూ క్రీడలకు సంబంధించి మైదానం ఏర్పాటు చేయనున్నారు. ఈక్రమంలోనే క్రీడాభివృద్ధి కోసం నూతన క్రీడాపాలసీని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ద్వారా రాష్ట్రం నుంచి ప్రపంచ స్థాయి క్రీడాకారుల తయారు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ వేదికగా జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీలు నిర్వహణకు కృషి చేయనున్నారు. ప్రజల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచి వారి జీవనశైలిలో మార్పు తేనున్నారు.



అశోక్‌నగర్‌లోని ఇండోర్‌స్టేడియం

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్



భారీగా ప్రోత్సాహకాలు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడాపాలసీలో క్రీడారంగానికి, క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరమైన ప్రోత్సాహకాలు అందించనున్నారు. ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధిస్తే రూ.7కోట్లు, రజతం రూ.5కోట్లు, కాంస్యం రూ.3కోట్లు, పోటీల్లో పాల్గొన్నవారికి రూ.15లక్షలు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నారు. ఆసియా క్రీడల్లో బంగారు పతకం సాధిస్తే రూ.4కోట్లు, రజతం రూ.2కోట్లు, కాంస్యం రూ.కోటి, పాల్గొన్న వారికి రూ.10లక్షలు బహుమతిగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కామన్‌వెల్త్ క్రీడల్లో పతకాలు సాధిస్తే అత్యధికంగా రూ.50లక్షలు, తక్కువగా రూ.25లక్షలు, పాల్గొన్న వారికి రూ.5లక్షలు అందజేయనున్నారు. భారత ఒలింపిక్ అసోసియేషన్, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, కామన్‌వెల్త్ క్రీడాసమాఖ్య...ఇలా ప్రఖ్యాత క్రీడా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో పతకాలు సాధిస్తే ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-1, 2, 3 స్థాయి ఉద్యోగాలు కల్పించనున్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉద్యోగ నియామకాల్లో ఇప్పటి వరకు ఉన్న 2శాతం రిజర్వేషన్‌ను 3 శాతానికి పెంచారు.



చాలా ఆనందంగా ఉంది

రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీలో తీసుకొచ్చిన అంశాలతో చాలా ఆనందం కలుగుతోంది. నాతో పాటు నాతోటి పారా క్రీడాకారులకు ఈ పాలసీ ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తోంది. క్రీడాకారులను ఇలా ప్రోత్సాహిస్తే కచ్చితంగా పతకాలు సాధించడానికి మరింతగా శ్రమిస్తారు. నేను కూడా రాబోయే కాలంలో పతకాల సాధనకు మరింత కృషి చేస్తా.

- పల్లవి, పారా జాతీయ క్రీడాకారిణి



క్రీడారంగానికి పూర్వ వైభవం

ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త క్రీడాపాలసీతో క్రీడారంగానికి పూర్వ వైభవం రానుంది. ప్రభుత్వం క్రీడాకారులకు ఇచ్చే ప్రతి అవకాశం, ప్రతి పైసాను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థానాలను అధిరోహించాలి. అప్పుడే ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రీడాపాలసీకి సార్థకత లభిస్తుంది.

- ఉదయ్‌భాస్కర్, డీఎస్‌డీఓ



చాలా ఉపయోగకరం

క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా క్రీడా పాలసీ ఉండటం శుభ పరిణామం. సర్టిఫికెట్లతో పాటు ఆర్థికంగా చేయూత నిచ్చేలా నగదు అందజేయడం క్రీడాకారుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రభుత్వాలు క్రీడాకారులు, క్రీడలను ప్రోత్సహించడం వల్ల గ్రామం, జిల్లా, రాష్ట్రం, దేశానికే మంచి పేరు వస్తుంది. ప్రభుత్వం చెల్లించే ప్రతి పైసా ఉపయోగకరంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

- సంధ్య, శాప్ కోచ్



అద్భుతమైన అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడా పాలసీ ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అద్భుతమైన అవకాశం. ఇప్పటి వరకు ఇంతటి భారీ ప్రోత్సాహకాలు ఎన్నడూ రాలేదు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలతో పాటు జాతీయ, ఇతర అంతర్జాతీయ క్రీడల్లో రాణించే క్రీడాకారులకు ఈ ప్రోత్సాహకం ఒక వరం.

- వెంకటేశులు, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ



అథ్లెట్లకు బంగారు భవిష్యత్తు

నగదు ప్రోత్సాహకంతో అథ్లెట్ల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినట్లే అనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడా పాలసీలో నగదు ప్రోత్సాహకం ఆర్థికంగా, మానసికంగా ఎంతగానో చేయూత ఇచ్చేలా ఉంది. పేద క్రీడాకారులు నిరంతర సాధన, పౌష్టికాహారం, క్రీడా సామగ్రి, యూనిఫాం, రవాణకు ఎంతగానో వెచ్చిస్తున్నారు. ప్రభుత్వం విజేతలకు అందజేసే ఆర్థిక చేయూతతో క్రీడాకారులపై ఆర్థిక భారం తగ్గి మరింత మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

- సురేష్, అథ్లెటిక్ కోచ్



కొండంత ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడా పాలసీ క్రీడాకారులకు కొండంత ప్రోత్సాహకం ఇస్తుంది. ఆసక్తి ఉన్న క్రీడల్లో ఆయా క్రీడాకారులు రాణించేందుకు ఇదొక మంచి అవకాశంగా భావిస్తున్నాం. క్రీడాపాలసీలో క్రీడా మైదానాలు, వసతుల కల్పన అత్యంత ప్రాధాన్యతమైంది. క్రీడా మైదానాలు, వసతులు లేక చాలా మంది పేద క్రీడాకారులు క్రీడలకు దూరమవుతు న్న పరిస్థితులు చూస్తున్నాం. ఇక ఆపరిస్థితులు ఉండవని అనుకుంటున్నాం.

- నరేష్, డీఎస్ఏ షటిల్ బ్యాడ్మింటన్ కోచ్



ప్రభుత్వానికి ధన్యవాదాలు

నూతన క్రీడాపాలసీలో పారా క్రీడాకారులకు ప్రత్యేక స్థానం కల్పించి నందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రాష్ట్ర విద, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరరావు, రామస్వామి, శాప్ ఎండీ-వైస్ చైర్మన్ గిరీషాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా పారా క్రీడాకారులను గుర్తించి ప్రోత్సాహకాలు ప్రకటించడం శుభపరిణామం.

- నాగరాజు, జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు



స్వాగతిస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వస్తున్న స్పోర్ట్స్ పాలసీని వ్యాయామ ఉపాధ్యాయులందరూ స్వాగతిస్తున్నాం. క్రీడా పాలసీ శుభ సూచికం. స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ 2శాతం నుంచి 3శాతానికి పెంచడం క్రీడాకారులకు అద్భుతమైన అవకాశం. రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి అవకాశాన్ని క్రీడాకారులు అందిపుచ్చుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వానికి పీఈటీలు, క్రీడాకారుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

- మొరార్జీ యాదవ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, పీఈటీ

న్యూస్ బాక్స్

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో జిల్లా విద్యార్థి



పవన్‌ను అభినందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు జిల్లాకు చెందిన డిగ్రీ విద్యార్థి పవన్ ఎంపికయ్యాడు. నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో పవన్ పాల్గొంటున్నాడు. నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న పవన్ ఎన్‌వైకే ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యూత్‌ఫెస్టివల్‌లో జనరల్ నాలెడ్జ్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్‌లో కూడా ప్రథమ స్థానంలో నిలిచి నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడు. తొలి రోజు శనివారం ఢిల్లీలో ప్రారంభమైన యూత్ ఫెస్టివల్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పవన్‌ను అభినందించారు. ఆదివారం రెండో రోజు ఫైనల్ రౌండ్ జరగనుంది.

మహాసభలను విజయవంతం చేయండి

అనంతపురం కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ద్వితీయ మహాసభలను విజయవంతం చేయా లని ఆ అసోసియేషన్ ప్రాంతీయ కార్యదర్శి నాగయ్య శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయ కల్యాణమండపంలో నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ రీజియన్ అధికారులు ముఖ్య అతిథు లుగా హాజరవుతారన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలపై చర్చించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రీజియన్‌లోని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులందరూ విరివిగా హాజరుకావాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల సంక్షేమమే

ఎమ్మెల్యే ధ్యేయం

- టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ
- మున్సిపల్ కార్మికులకు సంక్రాంతి కానుక పంపిణీ



కార్మికురాలికి సంక్రాంతి కానుకను అందజేస్తున్న దేవినేని ధర్మతేజ తదితరులు

కళ్యాణదుర్గం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కృషి చేస్తున్నారని టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ అన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద శనివారం ఆయన వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్ టీడీపీ కౌన్సిలర్లతో కలిసి సుమారు 64 మంది మున్సిపల్ కార్మికులకు సంక్రాంతి కానుక పేరుతో దుస్తులు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల బాగోగులు పూర్తిగా విస్మరించిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక మున్సిపల్ కార్మికుల ఆశయాలను నెరవేర్చుతోందన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని కార్మికులకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని సొంత నిధులతో సంక్రాంతి కానుకలు అందజేశారని చెప్పారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే అమిలినేని ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నెట్టికంటి సన్నిధిలో వెంకటరమణ మూర్తి దంపతులు

నెట్టికంటి సేవలో విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్

గుంతకల్లు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అడిషనల్ డైరెక్టరు వెంకటరమణ మూర్తి కుటుంబ సమేతంగా శనివారం ఉదయం కసాపురం దేవస్థానంలో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన వెంకటరమణ మూర్తి, ఆయన కుటుంబ సభ్యులను దేవస్థాన అధికారులు, అర్చకులు సాదరంగా ఆహ్వానించారు. స్వామివారి సన్నిధిలో పూజలు చేయించారు. స్వామివారి ఉత్తరీయాన్ని వేసి ఆశీర్వచనం పలికి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వాణి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో భారీగా సోలార్ ప్లాంట్లు

7500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం..

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

అనంతపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 7500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎన్టీపీసీ దక్షిణభారత కోఆర్డినేటర్ శంకర్ రాజు, ఏపీ ట్రాన్స్‌కో మాజీ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్‌బాబులతో శనివారం సమావేశమయ్యారు. ప్లాంట్ల ఏర్పాటుపై సమీక్షించారు. కాలవ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో వెనుకబడిన రాయదుర్గం ప్రాంతంలో యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు అవకాశం లభిస్తుందన్నారు. రాయదుర్గం పరిధిలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 1500 మెగావాట్ల ఉత్పత్తి ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఆ మేరకు స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో శ్రమిస్తూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నా రన్నారు. చంద్రబాబుపై విశ్వాసం, ప్రభుత్వ ప్రోత్సాహంతో వివిధ సంస్థలు, నిర్వాహకులు పరిశ్రమల స్థాపనకు రాష్ట్రానికి వస్తుండటం శుభపరిణామమన్నారు. ఈ నేపథ్యంలో రాయదుర్గం ప్రాంతాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లడానికి తీవ్రంగా శ్రమిస్తున్నానన్నారు. ఎన్టీపీసీ ద్వారా సుమారు 1500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో డి.హీరేహాళ్ మండల పరిధిలో ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ పవర్ గ్రిడ్, సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం సంస్థ ప్రతినిధులు ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. అవసరమైన భూమిని వివిధ ప్రాంతాల్లో పరిశీలిస్తున్నామన్నారు. ఎన్టీపీసీతో పాటు మరికొన్ని సంస్థలు కలిపి మరో 6000 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డి. హీరేహాళ్ టీడీపీ మండల కన్వీనర్ హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీపీసీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

అప్పుడో.. ఇప్పుడో..!

కూలేందుకు సిద్ధంగా ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులు

పిల్లర్లు దెబ్బతిని బయటకు కనిపిస్తున్న ఇనుప కడ్డీలు

భయాందోళనలో ఆయా గ్రామాల ప్రజలు





• ఈ చిత్రంలో కనిపిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు మండలంలోని కృష్ణంరెడ్డిపల్లి బీసీ కాలనీలోనిది. వాటర్ ట్యాంకు పూర్తిగా దెబ్బతింది. ఎప్పుడు కూలుతుందో అన్నట్లుగా పరిస్థితి ఉంది. ట్యాంకు పిల్లర్ల పెచ్చులూడిపోయి కంకర, కడ్డీలు బయటకు కనిపిస్తున్నాయి. పెద్ద గాలి వీస్తే ట్యాంకు ఊగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. జరగరానిది ఏదైనా జరిగితే స్థానికుల ప్రాణాలు పోయేపరిస్థితి ఉంది. మూడు దశాబ్దాల కిందట ఈ ట్యాంకు నిర్మాణం జరిగినట్లు సమాచారం.

అనంతపురం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలో దశాబ్దాల కిందట నిర్మించిన ఓవర్ హెడ్ నీటి ట్యాంకులు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ట్యాంకులు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతాయో అన్నట్లుగా పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకులు దెబ్బతిన్న విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలు గ్రామాల్లో దెబ్బతిన్న ట్యాంకులు

రూరల్ మండలంలోని ఉప్పరపల్లి, ఆకుతోటపల్లి, చియ్యేడు, తాటిచెర్ల, మన్నీల, కృష్ణంరెడ్డిపల్లి, పూలకుంట, కక్కలపల్లి కాలనీ, అక్కంపల్లి పరిధిలోని ఎస్ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఓవర్ హెడ్ నీటి ట్యాంకులున్నాయి. వీటిలో తాటిచెర్ల, కృష్ణంరెడ్డిపల్లి, కక్కలపల్లి కాలనీ పరిధిలోని ట్యాంకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పూలకుంట ఎస్సీ కాలనీలోని ట్యాంకు పరిస్థితి అప్పుడో.. ఇప్పుడో అన్నట్లుగా ఉంది. పూర్తిగా దెబ్బతినడంతో ట్యాంకుకు నీటి సరఫరా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఉప్పరపల్లిలోని ట్యాంకు మెట్లు దెబ్బతిడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఇనుప మెట్లు ఏర్పాటు చేయించారు. కాగా నరసనాయునికుంట గ్రామంలోని ట్యాంకు ఇటీవల కూలిపోయింది. ఈక్రమంలోనే దెబ్బతిన్న ట్యాంకులను తొలగించి, వాటి స్థానంలో నూతన ట్యాంకులను నిర్మించాలని కోరుతున్నారు.



పూలకుంట ఎస్సీకాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకు

ట్యాంకు నిర్మాణాలకు ప్రతిపాదనలు..

మండలంలో దెబ్బతిన్న ఓవర్‌హెడ్ ట్యాంకుల పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. శిథిలమైన వాటిని తొలగించి, వాటి స్థానంలో కొత్తని నిర్మించేందుకు ప్రతిపాదనలు కూడా పంపాం. అనుమతులు రాగానే పాతవాటిని తొలగించి కొత్తవాటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

- హరికుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

• ఇక్కడ కనిపిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు మండలంలోని తాటిచెర్లలోనిది. ఈ ట్యాంకును నాలుగు దశాబ్దాల కిందట నిర్మించినట్లు సమాచారం. ట్యాంకు పూర్తిగా దెబ్బతిని, శిథిలావస్థకు చేరకుంది. సిమెంట్ ఊడి పోవడంతో ఇనుప కండీలు కనిపిస్తున్నాయి. దీంతో ఎప్పుడు కూలుతుందో చెప్పలేని పరిస్థితి. స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.





అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్





ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

ఇంటి నుంచి పారిపోయిన

నలుగురు పిల్లలు

ఫిర్యాదు అందిన రెండు గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

డి.హీరేహాళ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఇంటి నుండి పారిపోయిన నలుగురు పిల్లలను గంటల వ్యవధిలోనే పోలీసులు పట్టుకుని కుటుంబసభ్యులకు అప్పగించిన సంఘటన శనివారం జరిగింది. మండలంలోని జాజరకల్లు గ్రామంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన చుట్టుపక్కల ఉన్న నలుగురు పిల్లలు ఇంట్లో కుటుంబసభ్యులు మందలించా రన్న కారణంతో శుక్రవారం అర్ధరాత్రి ఇంటి నుంచి పారిపోయారు. ఉదయం గమనించిన కుటుంబసభ్యులు చుట్టు పక్కల గాలించినా ఉపయోగం లేకపోవడంతో 11.30 గంటల సమయంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో రెండు బృందాలుగా ఏర్పడి గాలింపుచర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆ పిల్లలు ఉన్న ప్రదేశాన్ని కనుగొన్నారు. ఆ పిల్లలు కర్ణాటక విజయనగరం జిల్లా హాలిగి ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ఆ పిల్లలు ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. తన ఆ పిల్లలను తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం పిల్లల కుటుంబసభ్యులను పిలిపించి, అప్పగించారు. ర్యాదు అందిన రెండు గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ జగదీష్ అభినందించారు.

సరదా కోసం జీవహింసా..?



ఐదు బండ్లలో 80 బస్తాలు లాగుతున్న ఒంటెద్దు

కొందరు యువరైతులు సరదా కోసం పందేలు వేసి ఎద్దుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇటీవల మండలంలోని దేవగిరిలో కొందరు ఐదు బండ్లలో 70 ధాన్యం బస్తాలు వేసి ఒంటిఎద్దుతో ఒక కిలోమీటర్ లాగించారు. మరి మేమేం తక్కువ అనుకున్నారో ఏమో గోవిందవాడ గ్రామంలో కొందరు యువరైతులు శనివారం ఐదు బండ్లలో 80 ధాన్యం బస్తాలు వేసి ఒంటి ఎద్దుతో మూడు కిలోమీటర్లు లాగించారు. మూగజీవాలు కదా అదిలిస్తే పోతాయని అనుకుంటున్నారో ఏమో ఎంతంటే అంత బరువు వాటిపై వేసి లాగిస్తున్నారు. వాటికి కూడా ప్రాణం ఉంటుందని, పరిమితికి మించిన బరువు మోయలేవని మరచి జీవహింసకు పాల్పడుతున్నారు. అన్నదాతలారా..! ఒకసారి ఆలోచించండి అవి ఎద్దులు కాదు మీ జీవన నేస్తాలు.

- బొమ్మనహాళ్, ఆంధ్రజ్యోతి

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



కిరణ్మయి

ధర్మవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఈ నెల 14 నుంచి 19వతేదీ వరకు చెన్నైలో జరిగే అండర్-17 బాలికల ఎస్‌జీఎఫ్ నేషనల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు రాష్ట్ర బాలికల జట్టుకు ధర్మవరానికి చెందిన కిరణ్మయి ఎంపికైందని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఈ విద్యార్థిని కిరణ్మయిను శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ పట్టణ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ అభినందించారు.

రైతును మింగిన అప్పులు

పొలంలోనే అన్నదాత ఆత్మహత్య



నాగేశ్(ఫైల్)

తాడిమర్రి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బోరు, పైప లైన్ వేయడానికి చేసిన అప్పులు ఓ రైతును మింగేశాయి. తనకున్న 5.30 ఎకరాల్లో పంటలు సాగు చేసుకునేందుకు సీబీఆర్ ఏటీలో బోరు వేసి పైపులైన్ వేయడానికి అయిన ఖర్చులు ఆ రైతుకు భారమయ్యాయి. తాడిమర్రి మండలం దాడితోట గ్రామానికి చెందిన వాల్మీకి పుల్లన్న కుమారుడు నాగేశ్(42) శనివారం తన పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దాదాపు రూ.20 లక్షల దాకా అప్పులు చేసి తన పొలానికి రెండు కిలో మీటర్ల దూరంలోని సీబీఆర్ కాలువలో బోరు వేసి నీరుపడడంతో పైపులైన్ వేశాడు. మూడేళ్ల క్రితం అరటి పంటసాగు చేశాడు. అప్పటి నుంచి ఇప్పటి పంట సాగుకోసం అవుతున్న ఖర్చులు మాత్రమే దిగుబడిగా వచ్చిందేకానీ లాభాలు రాలేదు. దీంతో అప్పులకు వడ్డీలు పెరిగి రెండింతలు కావడంతో ఎలా తీర్చుకోవాలో దిక్కుతెలియని పరిస్థితిలో తన పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమీప బంధువు శివయ్య గమనించి బంధువులకు సమాచారం అందించాడు. రైతును బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. నాగేశ్‌కు భార్య లక్ష్మీదేవి ఉన్నారు. వీరికి సంతానంలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ క్రిష్ణవేణి తెలిపారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

- అరటితోటను నరికేసిన కేసు దర్యాప్తు
- రెండోరోజు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

పుట్లూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుగారికుంట గ్రామంలో అరటితోటను నరికిన కేసులో అనుమానితులను పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు అరటితోటను ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విషయంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబులు శనివారం మరోసారి పోలీసు జాగిలం పిలిపించి తనిఖీ చేయించారు. కొండుగారికుంట నుంచి డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయించగా పక్కనే ఉన్న కుమ్మనమల గ్రామంలోని మూడు ఇళ్ల వద్ద జాగిలం ఆగినట్లు సమాచారం. అనుమానంతో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అరటితోట నరికివేసిన కేసులో నిందితులను డాగ్‌స్క్వాడ్ ఆధారంగా పట్టుకున్నట్లు సమాచారం. జాగిలం కుమ్మనమల గ్రామంలో కొందరు ఇళ్ల వద్దకు వెళ్లి కూర్చొంది. నరికివేతకు ఉపయోగించిన కొడవలి వద్ద కూడా జాగిలం ఐదునిమిషాల పాటు కూర్చునట్లు సమాచారం. నిందితులను అనంతపురం తరలించినట్లు తెలుస్తోంది. అక్కడ పోలీసులు తమదైనశైలిలో కౌన్సెలింగ్ ఇవ్వగా నిందితులు అరటిచెట్లను నరికివేసినట్లు ఒప్పుకున్నట్లు సమాచారం.

చీనీ టన్ను రూ. 17వేలు

అనంతపురం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మా ర్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 17వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిం దు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6వేలు, సరాసరి రూ. 11వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం ఎనిమిది టన్నుల చీనీకాయలు వచ్చాయని అన్నారు.

టమోటా కిలో రూ. 16

అనంతపురం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 16తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 12, కనిష్ఠ ధర రూ. 8 పలికినట్లు ఆయన తెలిపారు.

709 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 709 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 442 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నగర పాలిక పరిధిలో వివిధ కార్పొరేషన్ల కింది అందజేసే సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని నగర ఇన్‌చార్జ్ కమిషనర్ మల్లికార్జునరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరిక్ మెడికల్ షాప్స్‌లో బీసీలకు ఏడు, ఈ బీసీలకు 10 యూనిట్లు కేటాయించారన్నారు. స్వయం ఉపాధిలో బీసీలకు 257, ఈబీసీలు 15 యూనిట్లు కేటాయించారని తెలిపారు. నగర ప్రజలు ఈ నెల 16తేదీ లోగా హెచ్‌టీటీపీఎస్//ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం దగ్గర్లోని సచివాలయం లేదా మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో సంప్రదించవచ్చన్నారు.

● అనంతపురం రూరల్: మండలంలో స్వయం ఉపాధి రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ దివాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని కార్పొరేషన్‌ల నుంచి మండలంలో జనరిక్ మెడికల్ షాపుల కోసం ఏడు యూనిట్లు, స్వయం ఉపాధి వ్యాపారాలకు 53 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు.

● నార్పల: బీసీ, ఈబీసీ యువతకు స్వయం ఉపాధి కల్పనకు వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందని ఎంపీడీఓ గంగావతి తెలిపారు. ఈ నెల 16తేదీ లోగా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు గ్రామ సచివాలయాలను సంప్రదించాలని ఎంపీడీఓ తెలిపారు.

నైపుణ్య శిక్షణతోనే ఉపాధి అవకాశాలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నైపుణ్య శిక్షణతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశాంక్‌మౌళి పేర్కొన్నారు. గత 45 రోజులుగా సంభవ్ ఫౌండేషన్, కియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డేటా అనలిస్ట్ ఉచిత శిక్షణ, ఉపాధి శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు వైస్ ప్రిన్సిపాల్ శశాంక్‌మౌళి చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంభవ్ ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతాంధ్ర పండితుడు కాశీవిశ్వేశ్వరశర్మ మృతి



కలవకొలను కాశీవిశ్వేశ్వరశర్మ(ఫైల్)

అనంతపురం కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు, సంస్కృత భాషల్లో పండితుడైన డాక్టర్ కలవకొలను కాశీవిశ్వేశ్వర శర్మ(58) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. అనంతపురంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో సంస్కృత భాష అతిథి ఉపన్యాసకుడుగా ఆయన పనిచేశారు. ఈయన ఎస్కేయూ విశ్రాంత ప్రొఫెసర్ ఆచార శలాక రఘునాథ శర్మ అల్లుడు. ఈయన సుందరకాండ అనే అంశంపై తెలుగులో పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. బ్రహ్మాండ పురాణం, స్కంద పురాణం, శివపురాణంలో 3200 శ్లోకాలను సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించారు. అనంతపురంలోని శ్రీవాణి డిగ్రీ కాలేజీలో, సాయివిజ్ఞాన్ జూనియర్ కాలేజీ, పాఠశాలలో సంస్కృతం బోధిస్తున్నారు. దూరవిద్య ద్వారా సంస్కృత తరగతులను సైతం నిర్వహిస్తున్నారు. అలాగే ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ, ఎస్వీ డిగ్రీ కాలేజీలలో సంస్కృత ప్రశ్నోత్తరి రూపకర్తగా వ్యవహరించారు. కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం నవ సంస్కృత అధ్యయన కేంద్రాధికారిగా పనిచేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అనంతపురం నగరంలో ఆర్‌కె నగర్‌లోని ఆయన నివాసంలో శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు.

డిఫెన్స్ మద్యం స్వాధీనం

అనంతపురం అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ పోలీసులు డిఫెన్స్ మద్యాన్ని పట్టుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముందస్తు సమాచారం మేరకు శనివారం అనంతపురం ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. నగరంలోని అరుణోదయ కాలనీలోని జమాల్ బాషా అనే వ్యక్తి నుంచి 20 డిఫెన్స్ ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో అనంతపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు జయనరసింహ, జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్, కానిస్టేబుల్స్ నరసింహ నాయక్, ఎర్రిస్వామి, హరినాథ్ రెడ్డి, సావిత్రి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

● ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, సరెండర్ లీవ్‌లను సంక్రాంతి పండుగ సందర్భంగా కూటమి ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ అన్నారు. ఆ సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్ర ఉద్యోగులకు రెండు డీఏలు, ఒక సరెండర్ లీవ్ పెండింగ్‌లో ఉండటంతో పాటు పోలీసు శాఖకు సంబంధించిన ఉద్యోగులకు మూడు అడిషనల్ సరెండర్ లీవ్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటితో పాటు జీపీఎఫ్ ఖాతాల నుంచి అత్యవసరాలకు విత్ డ్రా చేసిన అమౌంట్ కొన్ని నెలలు గడుస్తున్నా తమ ఖా తాల్లో జమ కాలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలని కోరారు.

సంక్రాంతి ఎఫెక్ట్

● ప్రయాణికులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్లు



ప్రయాణికులతో నిండిపోయిన అనంత ఆర్టీసీ బస్టాండు

అనంతపురం కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయాణ ప్రాంగణాలపై సంక్రాంతి పండుగ ఎఫెక్ట్ కనిపించింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఇప్పటికే విద్యార్థులంతా దాదాపు సొంతూళ్లకు చేరుకున్నారు. ఇక ప్రభుత్వ కార్యాలయాలకు సోమవారం నుంచి సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో శనివారం ఎటుచూసినా రోడ్లన్నీ వాహనాలమయమైంది. సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో అనంత ఆర్టీసీ బస్టాండు కిక్కిరిసి పోయింది. ఎటు నుంచి ఏ బస్సు వచ్చినా ఆయా రూట్లకు సంబంధించిన ఊర్ల ప్రయాణికులు బస్సుల్లో సీట్లు పట్టుకునేందుకు పోటీ పడ్డారు. పండుగ రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు 266 ప్రత్యేక సర్వీసులను ఏరాట్లు చేసింది. బస్టాండుకు వచ్చిన ప్రతి బస్సు ప్రయాణికులతో నిండి వెళ్లడం కనిపించింది. ఇదిలా ఉండగా శనివారం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో నగర రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసి రద్దీగా కనిపించాయి. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి. దీంతో ఆర్టీసీ పోలీసులు రోడ్లపైకి చేరుకుని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాల్సి వచ్చింది.



బస్సులో సీట్ల కోసం పోటీ పడుతున్న ప్రయాణికులు

రాజకీయాలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్ పంపిణీ

● ఎమ్మెల్యే పరిటాల సునీత



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయనిధి ద్వారా పేద వర్గాలను ఆదుకుంటున్న ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. అనంతపురంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో శనివారం రాప్తాడు నియోజకవర్గంలోని నలుగురికి సీఎం సహాయ నిధి ద్వారా రూ.9.70 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకి బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైద్య పరంగా అధికంగా ఖర్చులు పెట్టుకొనే వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. పార్టీలకతీతంగా అందిస్తున్నట్లు తెలిపారు.

కొత్త సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభం



నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం డిపోకు కొత్తగా వచ్చిన రెండు సూపర్ లగ్జరీ బస్సులను ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ప్రారంభించారు. రెండు నూతన బస్సుల్లో ఒకదానిని అనంతపురం - నెల్లూరు, మరో బస్సును అనంతపురం - ఒంగోలు రూట్లకు కేటాయించారు. అనంతపురం డిపో ఆవరణలో శనివారం జోనల్ చైర్మన్ పూల నాగరాజు రిబ్బన్ కట్‌చేసి, పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని, డిప్యూటి సీటీఎం శ్రీలక్ష్మి, డిప్యూటి సీఎంఈ రమేష్‌బాబు, డీఎం నాగభూపాల్, బస్టాండు మేనేజర్ కేఎస్ మూర్తి, ఆర్టీసీ కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, నాయకులు ఆంజనేయులు, రాధాకృష్ణ, గోపాల్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపై చిరుత దాడి

శింగనమల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందరాయునిపేటలో మందపై చిరుత దాడి చేయడంతో రెండు గొర్రెలు మృతి చెందగా, మరో మూడు తీవ్రంగా గాయపడ్డాయి. గోవిందరాయునిపేటకు చెందిన కాపరి ఎద్దుల సూరి తన గొర్రెల మందను గ్రామ సమీపంలో తోలుకున్నాడు. అయితే శనివారం తెల్లవారుజామున చిరుత గొర్రెల మందపై దాడి చేసింది. గమనించిన గొర్రెల కాపర్లు పెద్దఎత్తున కేకలు వేయడంతో చిరుత వెళ్లిపోయింది. అప్పటికే రెండు గొర్రెలు మృతి చెందగా, మరో మూడు గాయపడ్డాయి. గ్రామ సమీపంలో చిరుత సంచరిస్తున్నట్లు పలుమార్లు అటవీ అధికారులకు విన్నవించిన వారు పట్టించుకోవడంలేదని, దీంతో తాము నష్టపోతున్నామని గొర్రెల కాపర్లు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

● యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

అనంతపురం కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడీలందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో శనివారం నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్‌వాడీలందరికీ సుప్రీం కోర్టు తీర్పు మేరకు అమలు చేయలేదన్నారు. రానున్న కాలంలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ చేపట్టే ఐక్య పోరాటానికి అంగన్‌వాడీలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ భోగిమంటలలో విద్యుత్ బిల్లులు తగులబెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శకుంతల, రమాదేవి, కాత్యాయని, జ్యోతిలతా, విజయ, శ్రీదేవి, రంగమ్మ, నక్షత్ర, రేవతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వం తీసుకున్న పూల నాగరాజు





టీడీపీ జిల్లా అధ్యక్షుడి నుంచి పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, సుదర్శన్

అనంతపురం అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప రీజనల్ చైర్మన్ పూల నాగరాజు రూ. లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. నగరలోటని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ చేతుల మీదుగా పూల నాగరాజు పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. అలాగే కణేకల్లు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు సుదర్శన్ రూ.లక్ష చెల్లించి, పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, నాయ కులు కురబ నారాయణస్వామి, మూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.

'సినిమా డైరెక్టర్ చిట్టిబాబును అరెస్ట్ చేయాలి'

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రజకులను కించపరిచే విధంగా మాట్లాడిన సినిమా డైరెక్టర్ చిట్టిబాబును వెంటనే అరెస్ట్ చేయాలని ఏపీ రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్ట ర్ పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే డైరెక్టర్ చిట్టిబాబు రజకులకు క్షమాపణ చెప్పాలన్నారు. పోలీసులకు పిర్యాదు చేసిన వారిలో జిల్లా రజక చైతన్యసంఘం అధ్యక్షుడు మల్లేష్, దోబీఘాట్ అధ్యక్షుడు నాగరాజు, ఆనంద్, సుబ్రమణ్యం, రమేష్‌బాబు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

నార్పల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక గాంధీ కూడలి నుంచి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. పాఠశాలలో ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ప్రతి ఏటా ఇలాంటి సమ్మేళనం నిర్వహించుకోవాలని తీర్మానించారు. ఆనాటి ఉపాధ్యాయులు రామచంద్ర, శ్రీనివాసులునాయుడు, లక్ష్మీనారాయణ, అబ్రహం, శైలజ, బేగం, లక్ష్మీనారాయణప్రసాద్, బయపరెడ్డి, బాష, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లలో సంక్రాంతి సంబరాలు

అనంతపురం సెంట్రల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ క్యాంపస్‌లోని కేంద్రీయ విద్యాయంలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మార్కండేయులు సంబరాలను ప్రారంభించి పండుగ విశేషాన్ని వివరించారు. భోగి మంటలు వేసి ముగ్గులు, కోటాలు, గాలిపటాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

● అనంతపురం విద్య: నగరంలోని సాయినగర్‌లో ఉన్న రామన్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఆవరణలో కరస్పాండెంట్ రామన్, హెచ్‌ఎం తిరుమల దేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రంగవల్లులు, భోగి మంటలు వేసి పాటలు పాడుతూ సందడిచేశారు.



సంక్రాంతి వేడుకల్లో రామన్ స్కూల్ సిబ్బంది

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, జనరివరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లిలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. గ్రామస్థుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అలంకరించి, కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయం త్రం గ్రామ వీధులతోపాటు పంచాయతీ పరిధిలోని బీసీకాలనీ, సంతోష్‌నగర్ తదితర కాలనీల్లో ఊరేగింపు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన మారినేని వెంకటచౌదరి కుటుంబ సభ్యులు వెంకటేశ్వర స్వామి, భూదేవి, శ్రీదేవి ఉత్సవ విగ్రహాలను ఆలయానికి అందజేశారు.



పురవీధుల్లో ఊరేగిస్తున్న గ్రామస్థులు

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, సీఈఓ ఇతర అధికారులు

అనంతపురం విద్య, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్నకు జడ్పీ కార్యాలయంలో శనివారం ఘనంగా నివాళి అర్పించారు. ఆయన జయంతిని పురస్కరించుకుని జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిత్ర పటానికి జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రేనాటి వీరుడు ఓబన్నను స్మరించుకుంటూ ఆయన జయంతిని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



● అనంతపురం క్లాక్‌టవర్: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని, వడ్డెర జాతికి శుభదినమని వడ్డెర మహాసేన నాయకులు అన్నారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా శనివారం స్థానిక పా తూరులోని ఎన్టీఆర్ మార్గ్‌లో వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. మహాసేన నాయకులు మారుతీ వరప్రసాద్, విజయభాస్కర్, కిష్టప్ప, గోపి, సాంబ, శ్రీనివాసులు, రాము, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



● అనంతపురం రూరల్: మండలంలోని కృష్ణంరెడ్డిపల్లిలో వడ్డె ఓబన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామస్థులు రామకృష్ణ, కె. రామాంజినేయులు, తిరుపతయ్య, రామాంజినేయులు, నాగభూషణం, శ్రీరాములు, పోలన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



● నార్పల: మండల కేంద్రంలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వడ్డెర్ల సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం సభ్యులు వడ్డే సత్యనారాయణ రామదాసు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



● ఆత్మకూరు : మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం వడ్డెర్ల సంఘం మండల నాయకులు వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, వడ్డెర్ల సంఘం నాయకులు నాగేంద్ర, సర్దానప్ప, ఓసూరన్న, వెంకట్రాముడు, మహిళా నాయకురాలు సరళ, టీడీపీ నాయకులు ఓబుళపతి, రామదాసు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



● రామగిరి: మండలంలోని పేరూరులో వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. వడ్డెర కులస్థులు కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. ఆయన ఆశయాలను వడ్డెర కులస్థులు కొనసాగించాలని అన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ముగిసిన ఆటశాల సదస్సు



మాట్లాడుతున్న మాంచోఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా స్థానిక అనంత క్రీడాగ్రామంలో ఆర్డీటీ, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వ హించే ఆటశాల కాన్ఫరెన్స్ శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీటీ ప్రో గ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ...రెండు రోజుల పాటు జనరలిటాట్ వాలెన్సి యానా సహకారంతో పాన్ ఇండియన్ స్పోర్ట్స్ సదస్సు ఇక్కడ జరగడం శుభ సూచికమన్నారు. ఇలాంటి వేదికలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించి జిల్లాలో గ్రామీణ స్థాయిలో క్రీడలను, క్రీడా కారుల ను, బాలికలను పటిష్టం చేయడానికి కృషి చేస్తామన్నారు. క్రీడలతో బాలికలు, మ హిళలకు సాధికారత కల్పించడానికి, ప ర్యావరణ వ్యవస్థను సంస్థాగ తంగా సృష్టించడం ప్రధాన లక్ష్యమని మాజీ మహిళా క్రికెట్ ప్లేయర్, జాతీయ మహిళా క్రికెట్ జట్టు మే నేజర్ స్నేహల్ ప్రధాన్ పేర్కొన్నారు. గోస్పోర్ట్స్ ఫౌండేషన్ సహవ్యవ స్థాప కుడు, విన్నింగ్ మ్యాటర్స్ దక్షిణాసియా ఎండీ హకీ ముద్దీన్ హబీబుల్లా, క్రీడా పరిశోధకులు విజయ్ కృష్ణ మూర్తి, ఆర్డీటీ మహిళా సాధి కారత డైరెక్టర్ విశాలాఫెర్రర్, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

'సంఘమిత్ర'ను విజయవంతం చేయండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక సంవత్సరాలుగా సమాజసేవలో తరిస్తున్న స్వచ్ఛంద సంస్థల ఆత్మీయ సమావేశం పేరిట ఆదివారం ఏర్పాటు చేస్తున్న సంఘమిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మీనాక్షమ్మ ఫౌండేషన్ అధినేత రవికాంత్ రమణ, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ మల్లారెడ్డి, సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో వారు కోరారు. నగరంలోని అనంత కన్వెన్షన్ హాల్‌లో ఆదివారంత ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సమావేశం జరుగుతుందన్నారు.

ఆర్టీఏ తనిఖీలు.. 8 బస్సులపై కేసు

అనంతపురం అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా పరిధిలో ప్రైవేటు ట్రావెల్స్‌పై ఆర్టీఏ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. మరూరు, గుత్తి టోల్ ప్లాజాలతో పాటు ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేసి, అధిక చార్జీ ధరలు వసూలు చేసిన ఎనిమిది ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ నెల 18వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు స్పష్టం చేశారు. నిబంధనలు ఎవరూ అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్వార్టర్ ట్యాక్స్ చెల్లించండి

వాహన్ పోర్టల్లోకి రవాణా సేవలు మార్చిన నేపథ్యంలో ఈ నెలాఖరు దాకా వేచి చూడకుండా ముందస్తుగా ట్రాన్స్‌పోర్టు వాహనదారులు క్వార్టర్ ట్యాక్స్ చెల్లించాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు ఒక ప్రకటనలో సూచించారు. ఈ విషయంలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే అనంతపురం ఆర్టీఏ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల దాకా సంప్రదించాలని కోరారు.

కార్మికులకు పనిముట్ల అందజేత

అనంతపురం అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : నగరం 45వ డివిజన్‌లో పనిచేస్తున్న నగర పాలక సంస్థ కార్మికులకు టీడీపీ నాయకుడు దినేష్ చౌదరి అందజేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే సోదరుడు ప్రతాప్, టీడీపీ రాష్ట్ర నాయకులు బుగ్గయ్య చౌదరి, గంగారామ్ చేతుల మీదుగా కార్మికులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీఎల్ఎన్ మూర్తి, రమణ, నరేంద్ర చౌదరి, శ్రీనివాస్ చౌదరి, శీనా, చరిత తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: విప్ కాలవ

గుమ్మఘట్ట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని గలగల పంచాయతీ పైదొడ్డి గ్రామంలో నిర్మాణం పూర్తయిన సీసీరోడ్లు, ఐదు గోకులంషెడ్లను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి, గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందన్నారు. పాడి రైతులు గోకు లం షెడ్లను వినియోగించుకోవాలని సూచించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఇసుమంత అభివృద్ధి కూడా జరగలేదని విమర్శించారు. కూటమి వచ్చాక మళ్లీ అభివృద్ధి పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి మంజునాథ్‌గౌడ్, టీడీపీ మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ కన్వీనర్ కాలవ సన్నన్న, మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, సర్పంచు లు శివకుమార్, నాగరాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డును విప్ కాలవ శ్రీనివాసులు రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. అలాగే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకేరోజు రికార్డుస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల పైచిలుకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించామన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చొరవతో ఇది సాధ్యమైందన్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు వేయడానికి వెనువెంటనే అనుమతులు రావడం, పనులు చకచకా పూర్తికావడం జరిగిపోతున్నాయని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 16.41 కోట్ల నిధులతో 421 పనులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ సుధాకర్‌నాయక్, జేఈ మునిస్వామి, ఎంపీడీఓ కొండన్న, మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచ్ మల్లేశప్ప, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల ప్రారంభం

గుంతకల్లు: మండలంలోని కసాపురం గ్రామంలో రైతు పాటిల్ సూర్య ప్రకాశ్ రెడ్డికి మంజూరైన గోకులం షెడ్డును టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, నాయకులు బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, వాసగిరి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.


గుమ్మఘట్ట మండలం పైదొడ్డి గ్రామంలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

యాడికి: మండలంలోని కోనుప్పలపాడు, ఓబులాపురం, పిన్నేపల్లి గ్రామాల్లో గోకులం షెడ్లను టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని చిన్నవడుగూరు, దిమ్మగుడి, చిట్టూరు, తెలికి, కొండూరు గ్రామాల్లో మినీగోకులం షెడ్లను టీడీపీ మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ దివాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఏపీఓ పుల్లారెడ్డి, టీడీపీ నాయకులు శంకర్, నాగేశ్వరరావు, ఆదిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలోని పెరుగుపాలెం, ములకలేడు, కనకూరు గ్రామాల్లో గోకులం షెడ్లను టీడీపీ మండల నాయకులు, అధికారులు శనివారం ప్రారంభించారు.ఇన్‌చార్జి ఏపీఓ వెంకట రమణ, ఎంపీటీసీ సభ్యుడు లింగప్ప, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని 19 పంచాయతీలకు 48 మినీ గోకులం షెడ్లు మంజూరు కాగా 10 షెడ్ల నిర్మాణం పూర్తి కావడంతో శనివారం ప్రారంచారని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్‌డీ డీఆర్ కృష్ణకుమార్, వైస్ ఎంపీపీ కాయల మహేష్, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌చౌదరి, మాజీ ఎంపీటీసీ జింకల సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నట్లు చెప్పారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదు


జిల్లా అధ్యక్షుడి నుంచి శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న కళేకుర్తి సుదర్శన్

కణేకల్లు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళేకుర్తి గ్రామానికి చెందిన రాష్ట్ర వాల్మీకి సాధికారిక కమిటీ సభ్యుడు కళేకుర్తి సుదర్శన్ రూ. లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్‌కు రూ. లక్ష చెల్లించి పార్టీ జీవితకాల సభ్యత్వాన్ని పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను జిల్లా అధ్యక్షుడితో పాటు నాయకులు ఆలం నరసానాయుడు, నారాయణస్వామి తదితరులు అభినందించారు.


డాక్టర్ పత్తిహిమబిందు

గుంతకల్లుటౌన్: పట్టణానికి చెందిన టీడీపీ అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు పార్టీ శాశ్వత సభ్యత్వం పొందారు. అమరావతిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆమె రూ. లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం పొందారు. ఇందుకు గాను ఈమెను టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు సరుకుల అందజేత

ఉరవకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వజ్రకరూరు మండల కేంద్రంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులకు శనివారం మాల మహానాడు ఆధ్వర్యంలో నిత్యావసరసరుకులను అందజేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐ నాగస్వామి, సర్పంచ్ మోనాలిసా సుమారు 20 మంది కార్మికులకు వాటిని అందించారు. మాల మహానాడు నాయకులు బాలరామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ బల్బుల పంపిణీ

విడపనకల్లు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరులో ఏర్పాటు చేసేందుకు ఎల్‌ఈడీ బల్బుల పంపిణీ శనివారం గ్రామ సర్పంచ్ బ్యావులారాణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ వీధుల్లో ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేసి వెలుగులు నింపేందుకు పయ్యావుల సోదరులు వీటిని అందజేశారన్నారు. గ్రామ వీధుల్లో, ప్రధాన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. జీబీసీ డిస్ట్రిబూటరీ కమిటీ చైర్మన్ కాలువ మారయ్య, నాయకులు గడ్డం మారయ్య, కుమరస్వామి, కుమార్‌గౌడ్, వన్నూరుస్వామి, బావిగడ్డ వన్నూరు స్వామి, వడ్డే ఉలిగన్న, చౌడికి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ పర్యటన

బెళుగుప్ప, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపల్లి గ్రామంలో ఆదివారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పర్యటించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ శనివారం ప్రకటనలో తెలిపారు. పల్లె పండుగ ఉత్సవాల్లో భాగంగా గోకులం షెడ్ల ప్రారంభోత్సవానికి వస్తున్నట్లు చెప్పారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ యూనిట్ల మంజూరు

యల్లనూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-25 వ సంవత్సరానికి బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ యూనిట్లు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. స్వయం ఉపాధి కింద బీసీ-ఏకి 12, బీసీ-బీకి 8, బీసీ-డీకి 4, బీసీ-ఈకి 4యూనిట్లు మంజూరయ్యాయని అన్నారు. బీఫార్మసీ, ఎం ఫార్మసీ చదివిన వారికి మెడికల్‌షాపుల ఏర్పాటు కోసం బీసీకి ఒకటి, ఈబీసీకి ఒక యూనిట్ మంజూరయ్యాయన్నారు. యూనిట్ విలువ రూ.8లక్షలు కాగా ప్రభుత్వం రూ.4లక్షలు సబ్సిడీ ఇస్తుందని, బ్యాంక్ ద్వారా రూ.4లక్షలు రుణం పొందవచ్చని తెలిపారు. కమ్మ కార్పొరేషన్ ద్వారా ఒక యూనిట్ మంజూరైందన్నారు. మండలంలో 21 నుంచి 60 ఏళ్ల లోపు వయసున్న వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

17న ధర్నాకు తరలిరండి

బెళుగుప్ప, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : రైతాంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో ఈనెల 17వ తేదీన ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరగనున్నట్లు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతరాయుడు శనివారం ప్రకటనలో తెలిపారు. పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు ఇవ్వాలని, ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని, ఇంకా ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టనున్నారన్నారు. రైతులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పుట్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ. కొండాపురం గ్రామంలో రూ.5లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ సర్పంచు వనజాక్షమ్మ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పనులు మళ్లీ పుంజుకుంటున్నాయని తెలిపారు. జనరల్ ఫండ్ కింద మరో రూ.3లక్షల వ్యయంతో గ్రామంలో రోడ్లు వేసేందుకు ప్రణాళిక రచిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ఇంజనీర్ నరసింహారెడ్డి, సిబ్బంది మెహతా, గణేష్, చంద్రదండు నాయకులు చరణ్, నందకిషోర్, బాల కొండయ్య, వడ్డె కొండ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సీసీ రోడ్ల నిర్మాణం


బ్రహ్మణపల్లిలో చివరిదశలో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణం

కూడేరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం బ్రహ్మణపల్లిలో రూ. 4లక్షల వ్యయంతో రోడ్డు పనులు పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా సీసీ రోడ్లతో పాటు బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం దాదాపు రూ.5 కోట్ల వరకు నిధులు మంజూరు చేసింది. ఇందులో సీసీ రోడ్లకు రూ.రెండున్నర కోట్లు వెచ్చించింది. వివిధ గ్రామాల్లో ఇప్పటికే సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయినట్లు పీఆర్ ఏఈ రమణయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. త్వరలోనే వివిధ గ్రామాలకు తారు రోడ్ల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు.

దాడి చేసిన నలుగురి అరెస్టు

తాడిపత్రి, జనవరి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లి వద్ద ఈనెల 8వ తేదీన రోడ్డుపనులు చేస్తున్న మెగా కంపెనీ వర్కర్ సునీల్‌కుమార్‌పాండేపై దాడిచేసిన నలుగురిని శనివారం అరెస్టు చేసి వారివద్ద నుంచి సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. సునీల్‌కుమార్‌పాండేపై పట్టణంలోని సీపీఐకాలనీకి చెందిన ఆవుల ప్రదీప్, షేక్ హాజివలిలతోపాటు మరో ఇద్దరు మైనర్లు రాళ్లతో దాడి చేసి అతడి సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారని తెలిపారు. అందిన సమాచారం మేరకు పట్టణ సమీపంలోని ఆటోనగర్ బైపాస్ వద్ద నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

లారీ, కంటైనర్ ఢీ.. ఇద్దరికి గాయాలు

ఉరవకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి సమీపంలో శనివారం లారీ, కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకి గాయాలయ్యాయి. కొప్పల నుంచి అనంతపురానికి సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ, అనంతపురం నుంచి పూణేకు వెళ్తున్న కంటైనర్ బూదగవి వద్ద పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో లారీ, కంటైనర్ డ్రైవర్లు గోపాలకృష్ణ, రాహుల్‌కు గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదంపై ఆరాతీశారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి..

గుత్తిరూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామశివారులోని 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఊబిచెర్ల గ్రామానికి చెందిన చిన్నికృష్ణ బైక్‌లో గుత్తి నుంచి ఇంటికి వెళ్తున్నాడు. వన్నేదొడ్డి గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గోదాములను వినియోగించుకునేలా ఆదేశాలివ్వండి

గుంతకల్లు టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎఫ్‌సీఐ గోదాములను సివిల్‌సప్లై అధికారులు వినయోగించుకునేలా ఆదేశాలను ఇవ్వాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను భారత ఆహార భద్రత మండలి రాష్ట్ర డైరెక్టర్ విజయలక్ష్మి కోరారు. విజయవాడలో శుక్రవారం ఆమె మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. మంత్రి ఇందుకు సానుకూలంగా స్పందించారని ఆమె చెప్పారు.

కన్నుల పండువగా వెంకటేశ్వరుడి కల్యాణం

బెళుగుప్ప, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అర్చకులు తొలుత ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి ఉత్సవవిగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. వేడుకలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా కూడారై ఉత్సవం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు తొలుత స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పట్టువస్త్రాలతో, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పాలతో చేసిన ప్రసాదాన్ని నివేదించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రంగయ్య, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణస్వామి,కోశాధికారి గుండాసుధాకర్‌గుప్తా, ప్రసాదకమిటీ చైర్మన్ జయంతి వెంకట్, సభ్యులు పాల్గొన్నారు.


గుంతకల్లులో ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు


రాయదుర్గంలో ఓబన్నకు నివాళులు అర్పిస్తున్న కాలవ శ్రీనివాసులు


గుత్తిలో జయంతి వేడుకలో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్


కళ్యాణదుర్గంలో నివాళులర్పిస్తున్న టీడీపీ నేత ధర్మతేజ, నాయకులు


తాడిపత్రిలో కేక్‌కట్ చేస్తున్న వడ్డెర యువజన సంఘం నాయకులు

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి

● వాడవాడలా ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పోరాట యోధుడు వడ్డె ఓబన్న 218వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రాలు, మండలకేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో సైతం వేడుకలను జరిపారు. వడ్డెర కులస్థులతో పాటు పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఓబన్న విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న సేవలు అనిర్వచనీయమని తెలిపారు. రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సైన్యాధ్యక్షుడిగా ఉంటూ బ్రిటీష్‌వారిపై తిరుగుబాటు చేశారని కొనియాడారు. ఆయన్న స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామంటూ పిలుపునిచ్చారు. రాయదుర్గంలోని టీడీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఓబన్నకు నివాళులర్పించారు. మరుగున పడ్డ అనేకమంది వీరులను సీఎం చంద్రబాబు సమాజానికి పరిచయం చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా ఓబన్న జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. బీసీలను గుర్తించి, ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. గుత్తిలోని ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద ఉన్న వడ్డే ఓబన్న విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వడ్డెర్ల సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్, రాజీవ్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.


గుంతకల్లు పట్టణంలో బీజేపీ నాయకుల నివాళి


పామిడిలో కేక్‌కట్ చేస్తున్న వడ్డెర్లు


కుందుర్పి మండలం బెస్తరపల్లిలో వడ్డెర కులస్థుల నివాళి


బ్రహ్మసముద్రంలో వడ్డెర కులస్థులు, అధికారులు నివాళి


యాడికిలో వడ్డెర సంఘం నాయకుల నివాళి

ఘనంగా ముందస్తు సంక్రాంతి

రాయదుర్గం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చదం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సంస్కృతీ సాంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించారు. రంగురంగుల ముగ్గులువేసి, గొబ్బెలు పెట్టి పూజలు చేశారు. భోగిమంటలు వేశారు. హరిదాసు వేషధారణలలో పలువురు చిన్నారులు అలరించారు. హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వేడుకలో విద్యార్థులు

గుర్రపు స్వారీ అంటే మక్కువ: జేసీపీఆర్


గుర్రాన్ని పరిశీలిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గుర్రపు స్వారీ, వాహనాల డ్రైవింగ్ చేయడం అంటే తనకు చిన్నప్పటినుంచి ఎంతో మక్కువ అని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసం వద్ద శనివారం ఆయన స్థానికుడైన తాతయ్య శర్మకు చెందిన గుర్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేలిమి గుర్రాలు ఎక్కడ ఉంటాయని, తనకు ఒకటి కావాలని కోరారు. మహారాష్ట్రలోని అక్లూజ్ అనే పట్టణంలో సంత జరుగుతుందని, అక్కడ మేలిమి గుర్రాలు దొరుకుతాయని, గుర్రాన్ని బట్టి రేట్లు ఉంటాయని తాతయ్యశర్మ తెలియజేశారు. ఒకానొక సందర్భంలో గుర్రం ఎక్కేందుకు జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రయత్నించారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు


వెండి కవచ అలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, వెండికవచ, పుష్పాలంకరణ చేసి పూజలు చేపట్టారు. అనంతరం నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొనసాగిన జేసీ క్రికెట్ టోర్నీ


మ్యాచ్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న జేసీ క్రికెట్ టోర్నమెంట్ శనివారం కూమా కొనసాగింది. ముందుగా మొదటి మ్యాచ్‌లో ఆధార్ లెవన్ , సునామీ జట్లు తలపడ్డాయి. సునామీ జట్టు 74పరుగులు సాధించింది. ఆధార్‌లెవన్ జట్టు 69పరుగులు సాధించి ఓటమిపాలైంది. రెండో మ్యాచ్‌లో బీఎంబీ బాయ్స్ , రఘు లెవెన్ జట్ల మధ్య పోటీ జరిగింది. బీఎంబీ జట్టు 74పరుగులు సాధించగా, రఘు లెవెన్ జట్టు 7.3ఓవర్లలో లక్ష్యాన్ని సాధించి గెలుపొందింది. అనంతరం మరో నాలుగు మ్యాచ్‌లు జరిగినట్లు నిర్వాహకులు విజ్జి, సుధీర్, కందన్ తెలిపారు. మ్యాచ్‌లను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తిలకించారు.

ప్రతిభను వెలికితీయడానికే క్రీడాపోటీలు

రాయదుర్గం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గ్రామీ ణ ప్రాంతాల్లోని యువకుల్లో ప్రతిభను వెలికితీయడానికి క్రీడాపోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పే ర్కొన్నారు. పట్టణంలోని ప్రభు త్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను శనివారం సాయంత్రం ఆయన తిలకించారు. అక్కడ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ క్రికెట్ టోర్నమెంట్ విన్నర్స్‌కప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాపోటీల్లో గెలుపొందిన జట్టుకు కాలవ ఫౌండేషన్ తరఫున కాలవ భరత్ రూ. 40 వేలు నగదును అందజేస్తానని ప్రకటించారు. యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల వల్ల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. తర్వాత విజేతలకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కరేగౌడ మంజునాథ్‌గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ చేత పరిహారం ఇప్పించాలి: కాంగ్రెస్


మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మహేంద్ర

గుంతకల్లు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబాలకు రూ. కోటి చొప్పున టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు చేత పరిహారం ఇప్పించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహేంద్ర తదితరులు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ సినిమా థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో మహిళ మరణిస్తే అల్లు అర్జున్ చేత పరిహారాన్ని ఇప్పించిన విధంగా.. తిరుపతి ఘటనకు టీటీడీ చైర్మన్‌ను బాధ్యుడిని చేసి మృతుల కుటుంబాలకు పరిహారం ఇప్పించాలని తెలిపారు. నాయకులు ఆలం నవాజ్, ఫిరోజ్ ఖాన్, గాలి మల్లికార్జున, సువర్ణ, చిప్పగిరి లక్ష్మినారాయణ, ఖాదర్ వలి పాల్గొన్నారు.

సింగానహాళ్లిలో నాకాబందీ

బొమ్మనహాళ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగానహాళ్లి గ్రామంలో శనివారం తెల్లవారుజామున ఎస్ఐ నబీరసూల్ సిబ్బందితో కలిసి నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లను, దొడ్లను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. ప్రశాంతంగా జీవించాలని, గొడవలకు వెళ్లరాదని సూచించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఏఎస్ఐ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

యాడికి, జనవరి11(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఈరన్న తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించే విధంగా రూపొందించిన కేలెండర్లను శనివారం ఆయన మండలకేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ అరెస్ట్, లోన్‌యాప్ , ఏపీకే ఫైల్స్ తదితర మోసాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాల అవగాహన కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన కేలెండర్లను ప్రజలకు, ఉద్యోగులకు అందజేశారు. సైబర్ నేరం జరిగిన తక్షణమే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

ధాన్యం చోరీ కేసులో నిందితుల అరెస్టు

● 10 బస్తాల ధాన్యం, రెండు మోటార్లు, ఒక బైక్ సీజ్

యాడికి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ధాన్యం చోరీ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. వారి నుంచి 10ధాన్యం బస్తాలు, రెండు నీళ్ల మోటార్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యాడికిలోని ఒక వ్యాపారి గోడౌన్‌లో ధాన్యం చోరీ జరిగినట్లు కేసు నమోదైందని సీఐ తెలిపారు. దర్యాప్తులో భాగంగా శనివారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. యాడికిలోని వెంగమనాయుడుకాలనీకి చెందిన ఓబులేసు, రాఘవేంద్రకాలనీకి చెందిన ఖలీల్, చింతా గోవర్దన్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి 5జొన్నల ప్యాకెట్లు, 3కొర్రల ప్యాకెట్లు, 2 సజ్జల ప్యాకెట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. మరో రెండు కేసులకు సంబంధించి వారి నుంచి రెండునీళ్ల మోటార్లు, ఒక బైక్ సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులు ముగ్గురు స్నేహితులని, వ్యసనాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.


నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ